క్లుప్తంగా

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



కొడవలూరు : మండలంలోని నార్తురాజు పాళెం త్యాగరాజస్వామి సంగీత కళాక్షేత్రంలో ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం పాత పాళెం లాస్య, పుసుపులేటి సుదీక్షల భరతనాట్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి నిర్వహించిన సంగీత కచ్చేరికి మంచి స్పందన లభించింది. సంఘ నేతలు డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, పొన్నూరు చంద్ర, జువ్వలదిన్నె సురేష్, రుద్రకోట మనోహర్, గంగపట్నం సందీప్, ఉట్లపల్లి మనోహర్, రాపూరు సురేష్, వేణు, ఈశ్వరయ్య, నారాయణ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. నాటి విద్యార్థులంతా ఒకచోట చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ కుటుంబసభ్యులను పరిచయం చేసి ఆనందంగా గడిపారు. పాఠశాలలోని అన్ని గదులను పరిశీలించి, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన రిటైర్డ్ హెచ్‌ఎం వెంకయ్య, ఉపాధ్యాయినులు సుగుణ, ఇందిర, సుకన్య, పద్మావతి తదితరులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

ముత్తుకూరు : గ్రామాల్లో దోమల ఉధృతి అధికంగా ఉందని, వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆందోళన వెలిబుచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు వారు సమస్యలను తెలియజేశారు. ఎంపీపీ గండవరం సుగుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ నాగమణి మాట్లాడుతూ, ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమలు నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించాలని సర్పంచ్‌లకు సూచించారు. నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంఈఓ హేమసుందర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఆరు జెడ్పీ హైస్కూళ్లకు ఆరు స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయని, విద్యాశాఖ తాజా ఉత్తర్వుల మేరకు వీటిని మూడు కాంప్లెక్స్‌లకు కుదించామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, మండల ఉపాధ్యక్షుడు చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గొబ్బెమ్మల నిమజ్జనం



పొదలకూరు : పొదలకూరు పంచాయతీ వెంకటేశ్వరనగర్(తోకంచి)లో ఆదివారం వైభవంగా గొబ్బెమ్మల నిమజ్జనోత్సవం నిర్వహించారు. తెలుగుగంగ పునరావాస కేంద్రమైన వెంకటేశ్వర్‌నగర్‌లో సంక్రాంతి సందర్భంగా సుమారు నెలరోజుల పాటు గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి పాటలు పాడి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. మహిళలు కోలాటం ప్రదర్శిస్తూ గొబ్బెమ్మల గ్రామోత్సవంలో పాల్గొని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో డీలా

- పేరుకుపోతున్న బకాయిలు
- రూ.187 కోట్ల లక్ష్యం
- ఇప్పటివరకు వచ్చింది రూ.64 కోట్లే
- నగరపాలక సంస్థలో ఇదీ తీరు

నెల్లూరు(బారకాసు): నగరాభివృద్ధి సజావుగా సాగాలంటే పన్ను వసూళ్లు కీలకం. ఆస్తి, నీటి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా వచ్చే ఫీజులను వసూలు చేయాలి. అయితే నెల్లూరు నగరపాలక సంస్థలో పన్ను వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. లక్ష్యాన్ని సాధించలేకపోతుండటంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. క్షేత్రస్థాయి సిబ్బంది చొరవ చూపడం లేదనే విమర్శలూ లేకపోలేదు.

50 శాతమూ గగనమే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో 70 రోజుల్లో ముగియనుంది. ఈ క్రమంలో జనవరి రెండో వారం దాటుతున్నా, వసూళ్ల ప్రక్రియ 50 శాతానికీ చేరుకోలేదు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మాదిరిగా ప్రస్తుతం సంక్షేమ పథకాలు అందకపోవడం.. నానాటికీ ధరలు పెరుగుతుండటం.. ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి లేకపోవడం.. మార్కెట్ డీలాపడి వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగుతుండటం దీనికి ఓ కారణమవుతోంది.

సమయమివ్వండి..

పన్నుల వసూళ్ల నిమిత్తం కార్పొరేషన్ సిబ్బంది వెళ్లినప్పుడు చెల్లించేందుకు సమయాన్ని ప్రజలు కోరుతున్నారని తెలుస్తోంది. ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గడువు మార్చి నెలాఖరు వరకు ఉందని, అప్పటిలోపు చెల్లిస్తామని బకాయిదారులు కోరుతున్నారని సమాచారం.

ప్రభుత్వ శాఖలపై ప్రేమ

సామాన్యుల నుంచి పన్నులను ముక్కుపిండి వసూలు చేసే కార్పొరేషన్ అధికారులు ప్రభుత్వ శాఖలపై మాత్రం ఎనలేని ప్రేమ కురిపిస్తున్నారు. నోటీసులిచ్చి చేతులు దులుపుకొంటున్నారే తప్ప చిత్తశుద్ధితో వసూలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల భవనాలకు సంబంధించి 436 అసెస్మెంట్లున్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన 400 భవనాల నుంచి ఆస్తి పన్ను రూపంలో రూ.12 కోట్లను వసూలు చేయాల్సి ఉండగా, ఇది రూ.కోటికే పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వ భవనాలకు సంబంధించిన 36 అసెస్మెంట్ల నుంచి రూ.2.2 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, రూ.లక్ష మేరే రావడం గమనార్హం.



కార్పొరేషన్ కార్యాలయం

ఇదీ పరిస్థితి..

- కార్పొరేషన్ పరిధిలో ఖాళీ స్థలాలకు సంబంధించి 6500 అసెస్మెంట్లు ఉండగా, వీటికి గానూ రూ.17.5 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అయితే ఇందులో వసూలైంది రూ.ఐదు కోట్లే.
- ఇంటి పన్నుకు సంబంధించి 1.33 లక్షలు గృహాల నుంచి రూ.97 కోట్లను వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు అందింది రూ.41 కోట్లు మాత్రమే.
- నగరపాలక సంస్థ పరిధిలో 46,146 కుళాయి కనెక్షన్లున్నాయి. ఇందులో గృహావసరాలకు సంబంధించి 45,177కు గానూ రూ.39,48,80,407 వసూలు కావాల్సి ఉండగా, రూ.7,10,96,009 వసూలయ్యాయి.
- కమర్షియల్ కనెక్షన్లు 969కు గానూ రూ.19,42,22,913 వసూలు కావాల్సి ఉండగా, రూ.9,83,75,653 మేరే అందింది.

నూరు శాతం వసూలుకు కృషి



బకాయిదారులు పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలి. మొండి బకాయిదారులకు నోటీసులను జారీ చేస్తూనే ఉన్నాం. అప్పటికీ స్పందించని పక్షంలో కుళాయి, విద్యుత్ కనెక్షన్లను కట్ చేయిస్తున్నాం. స్పెషల్ డ్రైవ్‌ను రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిర్వహిస్తూ పన్నులను వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ శాఖలకు నోటీసులను జారీ చేస్తాం. నూరు శాతం వసూలే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం.

– సూర్యతేజ, కమిషనర్

అంతులేని నిర్లక్ష్యం

కార్పొరేషన్‌కు రావాల్సిన బకాయిల వసూళ్లను గాలికొదిలేసి తమ జేబులు నింపుకొనేందుకే రెవెన్యూ అధికారులు ఆరాటపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పన్నుల వసూళ్ల లక్ష్యాలను మంత్రి నారాయణ, కమిషనర్ సూర్యతేజ నిర్దేశించినా, వీరు మాత్రం నిర్లిప్త ధోరణిని అవలంబిస్తున్నారు. భవనాన్ని నిర్మించుకున్న వారు పన్ను వేయించుకునేందుకు దరఖాస్తు చేసుకుంటే, ఎవరైతే అడిగినంత ముట్టజెప్తారో వారి ఫైల్‌ను మాత్రమే క్లియర్ చేస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో మిగిలిన ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. దీర్ఘకాలిక బకాయిలున్న అసెస్మెంట్ల నుంచి పన్నులను వసూలు చేయడంలోనూ ఇదే పరిస్థితి. దీంతో బకాయిలు పేరుకుపోతున్నాయి.

'షాదీమంజిల్ నిర్మాణం శంకుస్థాపనకే పరిమితం'

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డికాలనీలో షాదీమంజిల్ నిర్మాణానికి పదేళ్ల క్రితం టీడీపీ హయాంలో అప్పటి మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారని, అయితే ఇది ముందుకు కదల్లేదని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా ఆరోపించారు. నగరంలోని జనార్దన్‌రెడ్డికాలనీలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. 53, 54వ డివిజన్లలో 12 వేల మంది ముస్లిం కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వీరికి అవసరమైన షాదీ మంజిల్ ఏర్పాటు కోసం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. షాదీమంజిల్ నిర్మాణం జరగకపోవడంతో అక్కడి స్థలంలోనే పేద ముస్లింలు వివాహాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సుబ్రహ్మణ్యం మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డ్రైవర్స్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేసిన చెరుకూరు సుబ్రహ్మణ్యం మృతి మున్సిపల్ కార్మికులకు తీరనిలోటని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఆయన మృతి చెందారు. దీంతో సంతపేటలోని బుజ్జమ్మరేవు వద్ద ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు.

ఘనంగా యోగి వేమన జయంతి



రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో..



డీసీఓ కార్యాలయంలో..

నెల్లూరు సిటీ: యోగి వేమన జయంతిని నెల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ శైలేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీసీఓ కార్యాలయంలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఓ గుర్రప్ప, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శ్రీలత, ఉమామహేశ్వరి, మల్లికార్జున, సత్యనారాయణ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల విజయవంతానికి పిలుపు



సీపీఎం నేతల ఇంటింటి ప్రచారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో వచ్చే నెల్లో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ 16వ డివిజన్లోని గుర్రాలమడుగు సంఘంలో ఇంటింటి ప్రచారాన్ని పార్టీ నేతలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు మాట్లాడారు. మహాసభలను ఫిబ్రవరి ఒకటి నుంచి నిర్వహించనున్నామని, ఇందులో భాగంగా ఆత్మకూరు బస్టాండ్‌నుంచి వీఆర్సీ గ్రౌండ్స్ వరకు మహా ప్రదర్శనను మూడున నిర్వహించి భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోహన్‌రావు, నగర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసులు, శాఖ కార్యదర్శులు ఆనంద్‌కుమార్, సంపూర్ణమ్మ, కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



ధనలక్ష్మీపురంలో రక్తదాన శిబిరం

నెల్లూరు సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ధనలక్ష్మీపురంలోని ప్రభుత్వ పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దాదాపు 200 మంది యువకులు రక్తదానం చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు విజయభాస్కర్, నోవా బ్లడ్ బ్యాంక్ మోటివేటర్ మోపూరు శివాజీనాయుడు, మధుసూదన్‌రెడ్డి, సభ్యులు పవన్ కుమార్‌రెడ్డి, రవి, సుమన్, కిరణ్, వినయ్, మల్లికార్జున్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న జయరాజ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కిడ్నీ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, యూరాలజిస్ట్ జయరాజ్ అవగాహన కల్పించారు. అనంతరం జనవరిలో జన్మించిన వాకర్స్‌కు వేడుకలను నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిలారి శ్రీనివాసులునాయుడు, నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, హరిబాబు, రామ్మోహన్‌రెడ్డి, నజీర్ అహ్మద్, సుబ్బరాయుడు, కొండూరు సుబ్బారావు, జయరామ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి



విజేతలకు బహుమతుల ప్రదానం

ఇందుకూరుపేట: క్రీడాకారులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎన్నెస్ఆర్సీసీ (ఏడో మైలు), ద్వితీయ స్థానంలో నిలిచిన పున్నూరు జట్టుకు బహుమతులను అందజేశారు. క్రీడా పోటీల వ్యవస్థాపకుడు జానా గిరిబాబు, కార్పొరేటర్ జానా నాగరాజు, మంచికంటి సుధాకర్, కమిటీ సభ్యులు రంగారావు, మధు, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



నెల్లూరు (టౌన్): మాగుంట లేఅవుట్లోని ఎస్సార్కే విశ్వసాయి స్కూల్లో కవి సమ్మేళనాన్ని పెన్నా రచయితల సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఫ్లెమింగోలను ఆహ్వానిస్తూ పలువురు కవులు కవితలను వినిపించారు. పెన్నా రచయితల సంఘ అధ్యక్షులు సుభద్రాదేవి, శ్రీధర్‌బాబు, మధుసూదన్‌రావు, రాము, లక్ష్మణ్, రవికుమార్, నాగేశ్వరమ్మ, అంకబాబు, సుధీర్, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జెడ్పీ వాకర్స్‌కు వైద్య పరీక్షలను ఆదివారం నిర్వహించారు. ఊపిరితిత్తుల వ్యాధులపై డాక్టర్ దినకర్ అవగాహన కల్పించారు. వాకర్స్ సంఘ గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి, చెంచయ్య, జాలీ వాకర్ రాజగోపాల్, కార్యదర్శి ఖాజామస్తాన్, మహిళా కార్యదర్శి హర్షవర్ధిని, ఎస్తేర్‌రాణి, ప్రసాద్, మేరీ బ్లెస్సింగ్స్, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలల చైతన్యానికి కమిటీ ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. జిల్లాలోని మాలలను చైతన్యం చేయాలనే లక్ష్యంతో ఐక్యవేదిక కమిటీని ఏర్పాటు చేశామని మాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర పేర్కొన్నారు. నగరంలోని విజయ్‌కుమార్ ఆస్పత్రిలో మాల ఉద్యోగుల ఐక్యవేదిక జిల్లా నూతన కమిటీని మాల ఉద్యోగ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. వర్గీకరణను దేశంలో ఎక్కడా చేపట్టలేదని, తెలుగు రాష్ట్రాలోనే ఇలా చేయడం సరికాదని చెప్పారు. దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఇంగిరాల మదన్, జనరల్ సెక్రటరీగా బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టాగూర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రాజు ఎన్నికయ్యారు. ఉద్యోగ సంఘ నేతలు విజయ్‌కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

వేలం.. సజావుగా సాగేనా..?

- రెండు రోజుల క్రితం అధికారుల అడ్డగింత
- తాము చెప్పిన వారికే ఇవ్వాలని బెదిరింపులు
- పోలీసుల భద్రత కోరిన మార్కెటింగ్ శాఖ
- 140 షాపులకు ప్రక్రియ నేడు

నెల్లూరు(సెంట్రల్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని కోనేరు షాపుల వేలం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులకు ఓ సవాల్‌గా మారింది. వాస్తవానికి నాలుగు నెలలుగా ఎన్నో మలుపులు తిరుగుతోంది. ఈ తరుణంలో ప్రక్రియను సోమవారం నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ షాపులపై కన్నేసిన కొందరు.. అధికారులను అడ్డుకునేందుకు యత్నించారు. తాము ఎన్నడిగితే అన్ని ఇవ్వాలని, లేని పక్షంలో పరిస్థితులు వేరుగా ఉంటాయనే సంకేతాలూ పంపారు.

ఎట్టకేలకు నేడు..

కోనేరు మార్కెట్లో నిర్మించిన నూతన షాపులకు వేలాన్ని సోమవారం నిర్వహించనున్నామని మార్కెటింగ్ శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఏ బ్లాక్‌లో 60.. బీ బ్లాక్‌లో 52.. సీ బ్లాక్‌లో 28 షాపులకు వేలాన్ని నిర్వహించనున్నారు. మరోవైపు అధికార పార్టీకి చెందిన పలువురు ఒకే షాపునకు ఐదు నుంచి పది దరఖాస్తులు చేసుకోవడంతో వేలం రసవత్తరంగా మారింది. వేరే వారి పేర్లపై వేసి షాపులను తమ ఆధీనంలో ఉంచుకునేందుకు యత్నిస్తున్నారని సమాచారం. పండ్ల వ్యాపారాలు చేసుకుంటున్న వారే వేలంలో పాల్గొనాలని చెప్తున్నా, పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. మరోవైపు వేలంలో గొడవలు జరిగే అవకాశాలు ఉండటంతో, పోలీసుల భద్రతను మార్కెటింగ్ శాఖ అధికారులు కోరారని తెలుస్తోంది.



కోనేరులోని షాపులు

నిబంధనల మేరకే..

మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు, నిబంధనల మేరకే వేలాన్ని నిర్వహించనున్నాం. ఏ చిన్న పొరపాటు జరగకుండా చూస్తున్నాం. వ్యవసాయ శాఖ ఆర్జేడీ స్వయంగా పాల్గొని వేలాన్ని నిర్వహించనున్నారు.

– శ్రీనివాసులు, మార్కెటింగ్ శాఖ సెక్రటరీ

గొడవ చేసేందుకు యత్నం

కోనేరు షాపుల వేలం ప్రక్రియ నిర్వహణకు మార్కెటింగ్ శాఖ అధికారులు కసరత్తును నాలుగు నెలల క్రితమే ప్రారంభించారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు షాపునకు డిపాజిట్‌గా రూ.25 వేలను చెల్లించాలని అధికారులు సూచించారు. దీంతో మార్కెటింగ్ శాఖ కార్యాలయానికి కొందరు ఇటీవల చేరుకున్నారు. తాము ఎన్ని షాపులకు వేసినా వాటిని అనుమతించాలని డిమాండ్ చేశారు. అయితే అర్హులకే అవకాశం కల్పిస్తామని, పండ్ల వ్యాపారాలు చేసే వారే షాపులను నిర్వహించాలనే నిబంధన ఉందని అధికారులు తేల్చిచెప్పారు. అయితే మాట వినకుండా అధికారుల చుట్టూ చేరి గొడవలు చేసేందుకూ యత్నించారని తెలుస్తోంది.

అమీర్‌జాన్‌కు అవార్డు

నెల్లూరు(బృందావనం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో జాతీయ స్థాయి కోనసీమ చిత్రకళా పరిషత్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన చిత్రకారుడు అమీర్‌జాన్ చిత్రం సస్ మంత్రకు బ్రహ్మోత్సవ చిత్ర నిధి అవార్డు లభించింది. దీన్ని ఆయనకు పలువురు అందజేశారు.